# పబ్లిషర్లున్నారు జాగ్రత్త ! !!

'చూడామణి నేలమీద నడవడం మానేసింది' అని ఈ మధ్య ఆమె స్నేహితురాళ్ళు అనుకోవడం విన్నాను.

కొందరు కుశాగ్ర బుద్ధులకు అనుమానం రావచ్చు.... ఆమెపట్ల భూమి వివక్షత చూపించి గురుత్వాకర్షణను రద్దుచేసిందాని. అదేం కాదు... భారమైన శరీరంతో ఆమె తేలిగ్గా చలాగ్గానడుస్తోందని తాత్పర్యం.

చూడామణి ప్రవర్తనలో మార్పు దుర్భిణి లేకుండానే నాలాంటి మందమతులకు కూడా కన్పిస్తోంది అంతకుముందు ఆ నారీమణి ఎవరితో పడితే వారితో మాట్లాడుతూనో లేదా పోట్లాడుతూనో దర్శనమిచ్చేది. ఆ పూబోడి మాటలకు భయపడి అల్పాయుష్కులు, పిరికివాళ్ళు దూరంగా పారిపోయేవాళ్ళు.

కాని ఇప్పుడు ఆ సుకుమారి ముక్తసరిగా భాషించడం కొద్ది మందిని బాధిస్తోంది.

'ఈ వింత ప్రవర్తనకు కారణమేమి చెప్మా' అని ముందు నేనూ ఆశ్చర్యపోయాను. తర్వాత తెలిసింది.

చూడామణి పెద్ద రచయిత్రి అయిపోయిందనీ 'రచయిత్రులు ఎక్కడో లేరయా.... మీ మధ్యనే ఉన్నారయా?' అంటూ గంతులేసుకుంటూ తిరుగుతోంది.

ఏ ప్రకారంగా ఆమె రచయిత్రయి మా అందరి అసూయకు కారణం అయిందంటే...

ఒక ప్రఖ్యాత వారపత్రిక సింగిల్ పేజీ కథల కాలమ్‌లో ఓ కాలమ్ ఆమెకోసం.. ఓ వారం కేటాయించారు.

పైగా ఈ పేజీలో కథ అచ్చయితే మీరు రచయిత్రి అయినట్టే అని ఎడిటర్‌గారు అభయం కూడా ఇచ్చేశారు.

ఇంకేముంది రాత్రికి రాత్రి ఆమె రచయిత్రి అయికూర్చుంది. కొందరు గిట్టనివాళ్లు 'ఇదేదో జగత్ప్రళయానికి నాంది లాగుంది' అనుకోవడం నాచెవిన పడకపోలేదు.

అప్పటినుంచి చూడామణి మాటల్లో "వాడో వెధవ వీడో వెధవ, వాడికేం తెలుసు... వీడికేం తెలుసు.. ఆఫ్టరాల్ వాడు రాసిన కథ ఏం బావుంది. ఊరికే పేరయితే వచ్చింది కాని ఆమెకింత వరకు కథలు రాయడంరాదు! కథరాయబోతే నవలవుతుంది. కవిత రాయబోతే కథవుతుంది. వ్యాసం రాయబోతే నాటకం అవుతుంది...." అంటూ మహా మహా ప్రఖ్యాత రచయిత్రుల్నీ.... రచయితల్నీ విమర్శిస్తూ మాట్లాడ్డం మొదలెట్టింది!

రోజులెప్పుడు ఒకేలా వుండవు.

మా అందరి కళ్ళు పచ్చబడ్డ వారానికి చూడామణికి ఓ ఉత్తరం వచ్చింది. అదీ

కథపడ్డ వారానికి. ఆమె ఆ ఉత్తరాన్ని మెళ్ళో వేసుకుని ఊరేగింది.

నాఖర్మ కొద్దీ ఎప్పుడో కాయితాలు ఖరాబుచేసి... ఒక్క రచనైనా వెలుగు చూడని గొప్ప దురదృష్ట రచయితనని ఆమె పరిచయం ఏర్పడిన తొలినాళ్ళల్లో చెప్పుకున్నాను.! మానవుడన్న తర్వాత ఆ మాత్రం పొరపాట్లు చేస్తూనే వుంటాడుకదా!

అదే నా గ్రహపాటైె చూడామణి ఆమెకొచ్చిన ఉత్తరాన్ని నాకు చూపించింది. దాని సారాంశం మర్చిపోదామన్నా మరువనివ్వకుండా ఉంది.

"చూడామణిగార్కి!

సాహితీ అభినందనలు. ఇంత చిన్న వయసులోనే ఇంత గొప్ప కథ రాసినందుకు మా సంస్థ తరపున అభినందిస్తున్నాం.

మీ 'వాజమ్మ' కథ మాకు బాగా నచ్చింది. ముమ్ముందు ఇలాగే బ్రహ్మాండమైన కథలు రాసి ఆ సాహితీ సరస్వతి మెళ్ళో అలంకరిస్తారని ఆశిస్తున్నాం!

ఇంకో శుభవార్త ఏమంటే... మా సంస్థ తరపున మీ కథను 'అప్పలరాజు యాభయ్యవ స్మారకోత్సవం' సందర్భంగా ఆవిష్కరించే 'కథా సంకలనం' లో చేర్చడానికి ఎంపిక చేశాం.

ఇకపోతే మా సంస్థ లాభా పేక్ష లేనిది. అందుకే సంస్థ కార్యక్రమాలకోసం.. ప్రచురణా వ్యయభారాన్ని భరించడం కోసం... మీ నుండి భారీగా డొనేషన్లు కోరుతుంది.

కనీసం ఐదువందలు తక్కువ కాకుండా పంపగోరతాం.

భవదీయుడు గోవిందరావు.

అది చదివిన తర్వాత నాకు నిజంగా భయమేసింది. మా కాలేజిలో చదువుతున్నది గదాని మా చూడామణిని మేంచులకన చేస్తున్నామని అనుమానం వచ్చింది.

ఎందుకైనా మంచిదని అభినందించాను.

"మీరే మంటారు.... డొనేషన్ పంపిస్తారా?" అడిగాను.

"వైనాట్! మనలాంటి వాళ్ళు ముందుకు రాకపోతే ఈ కళా సంస్థలు... సాహితీ సంస్థలు ఎలా బ్రతుకుతాయండి. పూర్వం రాజులు... జమీందారులు ఉండే వాళ్ళు... పోషించేవాళ్ళు... ఇప్పుడు మనమే ఆ పనికి పూనుకోవాలండి." పూనకం వచ్చినట్లు ఊగిపోతూ చెప్పింది.

నేను గొర్రెలా తలూపి తప్పుకున్నాను.

మళ్ళీ ఆమె కథలు ఎక్కడ పడతాయోనని మేమంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బ్రతుకుతున్న తరుణంలో స్మారక సమితి నుండి యాభయ్యవ వారికోత్సవానికి ఆమెకు పిలుపు వచ్చింది.

ఇంక ఆ హడావిడి సంగతి చెప్పక్కర్లేదు! ఆ ఊరికి ఎలా వెళ్ళాలని కన్పించిన

ప్రతి వాణ్ణీ, వాయించి పారేసింది. కొంపదీసి కథల గురించి తన్నేమైనా మాట్లాడమంటారేమోనని తెగ అనుమానపడింది.

ఎందుకైనా మంచిదని తెలుగు లెక్చరర్ల దగ్గరకెళ్ళి అస్సలు కథంటే ఏమిటీ - దానికి తలా, తోక ఉన్నాయా - ఉంటే అవి ఎలా వుంటాయీ.... ఆ కథలో ఏదైనా రసం పొర్లుతుందా... అలా పొర్లేది ఏరసం? ఎలా వుండాలి. తదితర మూల సామాగ్రి గురించి తెలుసుకొంది.

మా అందరికీ ఒకటే ఆశ్చర్యం! ఏనాడూ క్లాసు పుస్తకాల కోసం ఈ మాత్రం సిన్సియర్‌గా తయారుకానిది... దీని కోసం ఇంత మందిని చావగొట్టే ఓపిక ఎలా వచ్చిందనీ!

ఎంతైనా కారణ జన్మురాలు - ఆమె ఆ ప్రొద్దున మరునాడు జరుగవలసిన ఆ బ్రహ్మాండ ఆవిష్కరణకు హాజరు కావడానికి తయారై సూట్ కేసును వీధిలో పెట్టిన తరుణంలో... ఓ టెలిగ్రామ్ వచ్చింది.

'గ్రాండ్ మదర్ సీరియస్ - స్టార్ట్ ఇమ్మీడియట్లీ....' చూడామణిని చూడాలి. బామ్మకు బాగోలేదని కంటే సాహితీ సభను జన్మసుకృతం కొద్దీ అప్పుడు నేను కన్పించాను. కాకున్నది కాకమానదని కారణమడిగాను.... కుమార్‌గారూ! మా బామ్మను చూశారా నాకెంత అన్యాయం చేసిందో... ఇప్పుడే సీరియస్ కావాలా... యాభై ఏళ్ళుగా బ్రతుకుతున్నది. ఇంకెప్పుడూ సమయం దొరకనట్లు ఇప్పుడే మంచం పట్టాలిటండీ... చూడండి... నేను రెడీ.. అవతల నాకోసం వాళ్ళు వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటారు. స్టేషన్‌కు టాక్సీ కూడా తెచ్చి ఉంటారు. నాకు కాళ్ళు చేతులు ఆడ్డంలేదు. ఏం చేయాలండి?" కుండల కొద్దీ కారుతున్న విషాద భాష్పాలను తుడుచుకుంది తువ్వాలుతో.

"చూడామణి గారూ, చూడండి... మీకు బామ్మ ముఖ్యం. మీరు లేకుండా బామ్మ బాల్చీ తన్నితే లోకం మిమ్మల్ని ఆడిపోసుకుంటుంది! కథా సంకలనం అంటారా... ఆవిష్కరింపబడిన తర్వాత మీకు రాకపోదు" అని హితోపదేశం చేశాను.. ఓ పదినిముషాలు.

"నాకైతే మనుసురావడం లేదండి... గోవిందరావు ఎంత ఇదవుతాడో అక్కడ!" అని కంటికి మింటికి వగచింది.

"నేను వేరే పని మీద ఆ ఊరుదాటిపోతున్నాను. మీకోసం... నా ప్రయాణం బ్రేక్ చేసుకుని.... ఆ సభకు హాజరయి ఆ విశేషాలు మీకు చెబుతాను" అని ఒట్టుపెట్టాను.

అప్పటికి ఆమె మనసు కుదుటపడింది. ఎన్నో జాగ్రత్తలు చెప్పి పంపింది.

ఆ మర్నాడు ఆ ఊరిలో దిగి ఆ సంస్థ గురించి ఎంత వాకబు చేసినా ఎవరూ చెప్పలేకపోయారు.

నాకు తెలుగు వారి నీరవ నిస్తేజం పట్ల జాలి కలిగింది. వాళ్ళ ఊరులో అంత గొప్ప సంస్థ పెట్టుకుని..... వారేమీ తెలుసుకోకపోవడం కేవలం తెలుగువారి సహజగుణం

అనిపించింది.

ఆ సాయంత్రం వేదిక చేరుకోగలిగాను. ఎక్కడా కోలాహలం వగైరా కనబడలేదు.

లోపలికిపోయి చూద్దును గదా... ఓ పెద్ద హాల్లో నాతో కలిపి ఏడుగురున్నారు.

వేదిక మీద ఓ పెద్ద బ్యానర్... 'అప్పల్రాజు యాభయ్యవ స్మారకోత్సవం....' అని వేదిక మీది టేబుల్ మీద ఓ పార్శిల్.

ఎట్లాగయితేనేం సభ ప్రారంభమైంధి. ఓ అమావాస్య చంద్రుడు లేచి పుస్తకాల్ని ఆవిష్కరించాడు.

గోవింధరావు, అప్పల్రాజు తన తండ్రి అనీ ఆయన అత్యద్భుత స్టేజి నటుడనీ ఓ గంట వాయించి పారేశాడు.

నాటక రంగస్థల చరిత్రను చదువుకున్న నాకు అటువంటి పేరున్నవాడు ఏ నాటకంలో వేసినట్లు గుర్తుకూ రాలేదు.

ఆరుగురు మాట్లాడిన తర్వాత సభ ముగిసింది. ఓ ఇరవై రూపాయలిచ్చి ఆ కథా సంకలనం కొన్నాను. ఊరికే ఇమ్మంటే... ఇవ్వకపోతేనూ బాగుండదనీ.

దానిలో ఓ ఇన్నూర్ కథలున్నాయి. పేజీ కొకటే. అన్నీ 'తెలుగుభూమి'లో సింగిల్ పేజీ కథలో పడ్డవే! మొత్తం రెండొందల కథలు, రెండొందల న్యూస్ పేపరు కాగితంలో ప్రింట్ అయ్యాయి. అన్నీ అచ్చు తప్పులు. ఏ మాత్రం ఆకర్షణ లేని అట్టలు.... వెరసి చిత్తు కాగితాల పుస్తకం లాగుంది.

చూడామణి తిక్క కుదిరిందని నాకు సంతోషమేసింది. నేను నా టూరు ముగించుకుని వచ్చేసరికి చూడామణి ఇంకో ఐదొందలు తగలేసి.... ఆ వీపీపీని విడిపించుకుంది. ఓ పాతిక పుస్తకాలు కొనుక్కుంది గోవిందరావు చేతి చలువ వల్ల.

గిట్టని వాళ్ళు చెప్పారు. ఆ కథా సంకలనాన్ని చూసి చూడామణి వలవలా ఏడ్చిందట! వాళ్ళ బామ్మ పోయిందానికి కూడా అంత ఏడవలేదట!

అదేమోగాని చూడామణి ఇప్పుడు నేలమీద నడుస్తోంది.